నారావారిపల్లి



● మొదలైన ఇంటింటి సర్వే...
ప్రత్యేకాధికారిగా డీపీవో

నారావారిపల్లి రూపుమారుతోంది..!

విద్య, నైపుణ్యాలు, వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణలకు ప్రాధాన్యం

సొంత ఊరి అభివృద్ధిపై దృష్టి సారించిన సీఎం



నైపుణ్యాల శిక్షణ కోసం సిద్ధమవుతున్న షెడ్లు

తిరుపతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లి రూపురేఖలు మరో ఆరు నెలల్లో మారనున్నాయి. కుప్పం తరహాలో నారావారిపల్లికి కూడా ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారి ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. చంద్రబాబు తన సొంత ఊరి అభివృద్ధిపై దృష్టి సారించిన నేపథ్యంలో సీఎంఓ దిశా నిర్దేశంతో జిల్లా యంత్రాంగం వడివడిగా అడుగులేస్తోంది. ఇటీవల సోదరుడి అంత్యక్రియలు, కర్మక్రియల కోసం గ్రామంలో కొన్ని రోజులు గడిపిన నేపథ్యంలో ఆయన తన ఆలోచనలను కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పంచుకున్నారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా రోడ్డు కనెక్టివిటీ, టీటీడీ కల్యాణ మండపం, వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఆస్పత్రి వంటివి తెప్పించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన సొంత ఊరిని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించాలని తీర్మానించుకున్నారు. ఈ క్రమంలో ఆ గ్రామంతో ముడిపడివున్న రంగంపేట, కందుల వారిపల్లి, చిన్న రామాపురం సచివాల యాల పరిధిని ఎంచుకున్నారు. ఈ మూడు సచివాలయాల పరిధిలోని కుటుంబాల సమగ్ర వివరాలూ సేకరించనున్నారు. దానికోసం "ఒక కుటుంబం...ఒక వ్యవస్థాపక వ్యాపారవేత్త" (ఒన్ ఫ్యామిలీ - ఒన్ ఎంటర్‌ప్రెన్యూర్) అనే నినాదంతో ఇంటింటి సర్వే మొదలైంది. అవసరాలేమిటన్నది లోతుగా ఆరా తీస్తున్నారు.

ఆధునిక వసతుల కల్పనపైనా దృష్టి

ఇన్‌డోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం గుర్తించారు. నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచారు. అక్కడే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సీడీఎం సదుపాయం ఉన్న ఏటీఎం ఏర్పాటు కానుంది. చిన్న రామాపురం పంచాయతీలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ క్వాలిటీ పెంచనున్నారు. ఈ-ఆటోలు, ఈ-బస్సు అందుబాటు లోకి రానున్నాయి. ఇవన్నీ ఈ నెలాఖరులోపు అందుబాటులోకి రానున్నాయి. మౌలిక సదుపాయాలకు సంబంధించి రూ.41 లక్షలతో 11 తాగునీటి పథకాలు, రూ.81 లక్షలతో ఐదు సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రూ.21 లక్షలతో వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి కానున్నాయి. ఐతేపల్లి నుంచీ రంగంపేట వరకూ రోడ్డు ఏర్పాటు చేయడం ద్వారా అటు నాయుడుపేట-పూతలపట్టు ఆరు వరుసల జాతీయ రహదారి నుంచీ ఇటు మదనపల్లె-తిరుపతి నాలుగు వరుసల జాతీయ రహదారిని కలపనున్నారు.



ఇంటింటి సర్వేలో భాగంగా కుటుంబాల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

చదువు, నైపుణ్యాల పెంపుపై ప్రధాన దృష్టి

పది ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయనున్నారు. అంగన్‌వాడీ నుంచీ మూడవ తరగతి వరకూ నాణ్యమైన విద్యను ఆపై టెన్త్ వరకూ సమగ్ర విద్యను పిల్లలకు అందించనున్నారు. ఆ ప్రాంతంలోని ఏకైక జడ్పీ హైస్కూలును శ్రీసిటీ దత్తత తీసుకోనుంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరంగా ఆ స్కూల్‌ను రాష్ట్ర స్థాయిలో ఆధునిక ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దనుంది. నైపుణ్యాలు అవసరమైన వారికి కొత్తగా శిక్షణ, ఇప్పటికే శిక్షణ పొందిన వారికి ఉన్నత శిక్షణ, శిక్షణ పొంది మరచిపోయిన వారికి తిరిగి శిక్షణ ఇప్పించనున్నారు. అర్హత ఉన్న వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. మిగిలిన వారికి స్థానికంగానే వివిధ రకాలైన అంశాల్లో శిక్షణ ఇచ్చి వస్తు ఉత్పత్తికి అవకాశం కల్పిస్తారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా రైతులకు అవసరమైన సాయం అందించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు, డీఆర్‌డీఏ ద్వారా స్వయం ఉపాధికి యూనిట్లు వంటివి అందించనున్నారు.

నారావారిపల్లి అభివృద్ధికి వేగంగా చర్యలు: కలెక్టర్

ఇంటింటి సర్వే ఈ నెలాఖరుకు ముగియనుంది. ఇప్పటికే పాఠశాల అభివృద్ధికి రూ.80 లక్షలతో అంచనాలు రూపొందించి శ్రీసిటీకి అందజేశాం. నైపుణ్యాల శిక్షణ పరంగా ప్రస్తుతానికి 1800 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన రెండు భవనాలను గుర్తించి సిద్ధం చేశాం. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల గురించి మరింత ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నాం. నైపుణ్యాల శిక్షణ పేరిట నామమాత్రపు చర్యలకు పరిమితం కావడం లేదు. అర్హత ఉన్న వారికి ఎలక్ట్రానిక్స్, ఎయిర్ కండిషనింగ్, ఆటోమోటివ్, ఫుడ్ ప్రాసెసింగ్, హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ వంటి సాఫ్ట్ స్కిల్స్ పైనా దృష్టి పెడుతున్నాం. నారావారిపల్లి పరిధిలో ప్రతి ఇంటి నుంచీ ఒక వ్యవస్థాపక వ్యాపారవేత్త తయారై మంచి ఆదాయం సంపాదించడమే అంతిమ లక్ష్యంగా పనిచేస్తున్నాం.

కోడి బొచ్చు కథ

ముగియలేదు

● చికెన్ వేస్ట్ మాఫియాలో చొరబడిందెవరు? ● పవన్ చెప్పినా కొనసాగుతున్న దందా

'కోడి బొచ్చును కూడా నెలకు రూ.20లక్షలకు అమ్ముకునే వాళ్లు మనకు ఎమ్మెల్యేలుగా కావాలా?' అని ఎన్నికల ముందు జనసేనాని పవన్ కల్యాణ్ తిరుపతిలో జరిగిన ప్రజాగళం సభలో మాట్లాడారు. ఇంతకీ కోడి బొచ్చు కథేంటి? అంటూ అప్పట్లో పెద్ద చర్చే నడిచింది. కోడి బొచ్చు.. అంటే 'చికెన్ వేస్ట్' మాఫియాతో వైసీపీ నేతల హస్తం ఉందన్న ప్రచారం తెరపైకి వచ్చింది. పవన్ వ్యాఖ్యలను వైసీపీ నేతలు ఖండించకపోవడంతో ఆ ఆరోపణలకు మరింత బలం చేకూరింది. చికెన్ వేస్ట్ కూడా అప్పటి అధికార పార్టీ నేతలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని తెచ్చిపెట్టినట్టుగా తేటతెల్లమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కోడిబొచ్చు కథ ముగిసిందా.. అంటే లేదనే సమాధానమే వస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



చికెన్ వేస్ట్ సేకరిస్తున్న దృశ్యం

గతంలో వైసీపీ నేతలకు కాసులు కురిపించిన కోడిబొచ్చు రవాణా ఇప్పుడూ యథేచ్ఛగా సాగుతోంది. దీని వెనుక కూటమి నాయకులున్నారా? లేదా అధికార యంత్రాంగం కాసులకు కక్కుర్తి పడుతోందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక చికెన్ వేస్ట్‌ను కూడా క్యాష్ చేసుకోవచ్చని తెలుసుకున్నారు. తమకు తెలియకుండా ఏ ఒక్క షాపు కూడా చికెన్ వేస్ట్ ఇవ్వకూడదని మున్సిపల్ అధికారులను అడ్డుపెట్టుకుని మాఫియాకు తెరలేపారు. వారు చూపిన దారిలోనే ఇప్పటివాళ్లు కూడా నడుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇందులో ఎవరి పాత్ర ఎంత ఉందనేది అంతుపట్టడంలేదు.

ఒకప్పుడు అలా... : కొన్నేళ్ల క్రితం మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేవారు. దీనికోసం చికెన్ స్టాళ్ల యాజమాన్యం సిబ్బందికి కొంత మొత్తం ముట్టజెప్పాల్సి వచ్చేది. డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని వారు వ్యర్థాలను నిర్మానుష్య ప్రాంతాల్లో పడేసేవారు. వీటిని తిరుపతితో పాటు సమీప జిల్లాలలోని చేపల చెరువులు, పందులకు ఆహారంగా వినియోగిస్తూ వచ్చేవారు. దీంతో కొందరు రంగంలోకి దిగి చికెన్ స్టాల్స్ యాజమాన్యాన్ని సంప్రదించి మీకు ఎలాంటి శ్రమ లేకుండా ఉచితంగా తామే వేస్ట్‌ను తీసుకెళతామని చెప్పడంతో షాపుల నిర్వాహకులు అంగీకరించి వారికి ఇవ్వడం మొదలుపెట్టారు.

ఇలా సేకరిస్తారు...

కోళ్లను కోసిన అనంతరం వ్యర్థంగా పడేసే భాగాలను ప్రత్యేక వాహనాల ద్వారా ఓ ముఠా చేపల చెరువులు, పందులకు ఆహారంగా తరలిస్తోంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ముఠా సభ్యులు ప్రత్యేక వాహనాల్లో చికెన్ షాపుల వద్దకు చేరుకుంటారు. కోళ్లనుంచి తీసిన పేగులు, తల, కాళ్లు, చర్మం, ఈకలను వాహనంలోని భారీ ప్లాస్టిక్ డ్రమ్ముల్లో వేసుకుని తరలిస్తున్నారు. వీటిని తీసుకెళ్లే వారు అధికమొత్తంగా చేపలకు, పందులకు ఆహారంగా వినియోగిస్తారు. వీటిని తిన్న మనుషులకు ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని వైద్యులు అంటున్నారు.

ఇలా చేయొచ్చు..

వాస్తవానికి వ్యర్థాలు నగరపాలక సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టేలా ఉండాలి. టెండర్ ద్వారా ఏదైనా ఏజెన్సీకి అప్పగించి చికెన్ వేస్ట్‌ను తీసుకెళ్లేలా చేయాలి. వారు దాన్ని వెట్ వేస్ట్ ప్రాసెసింగ్ చేసి జంతువులకు ఆహారంగా (మీట్‌మీల్) వినియోగిస్తారు. కొన్ని కార్పొరేషన్లలో ఇలాంటి విధానం జరుగుతోంది కూడా. తిరుపతి నగరపాలక సంస్థ మాత్రం అలాంటి పనిచేయకుండా మాఫియా ముఠాకు సహకరించడమేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కిలో కోడి వ్యర్థాల నుంచి 300 గ్రాముల మీట్‌మీల్ వస్తుంది. తిరుపతిలో రోజుకు 2 టన్నుల కోళ్ల వ్యర్థాలు ఉంటాయి. వీటిని కార్పొరేషన్ ద్వారా సేకరిస్తే టన్నుకు రూ.2వేలు చొప్పున రూ.4వేల వరకు సంస్థకు ఆదాయం వస్తుంది. మరోవైపు చేపలు, పందులకు వీటిని ఆహారంగా ఇవ్వడాన్ని నివారించొచ్చు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తీర ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ మెరైన్ పోలీసులకు సూచించారు.తూపిలిపాలెం, దుగరాజపట్నం బీచ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దుగరాజపట్నంకు సంబంధించిన కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పూడిరాయి దరువు వద్ద జెట్టి నిర్మాణానికి అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లేటప్పుడు ఆధార్, బయోమెట్రిక్ కార్డు వెంట తీసుకుని వెళ్లేలా చర్యలు చేపట్టాలని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజును ఆదేశించారు. కోస్టల్ సెక్యూరిటీలో ఖాళీలను భర్తీ చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సముద్రంపై అక్రమంగా చేపల వేట జరగకుండా జాయింట్ పెట్రోలింగ్ చేయాలన్నారు. సమావేశంలో డీసీఐఓ శిరీష, క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అదనపు ఎస్పీ మధుసూదన్‌రావు, కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్ తిరుపతి సూపరింటెండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, కోస్ట్‌గార్డ్ అధికారి బేగ్, డీఎస్పీ గిరిధర్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజ, మెరైన్ పోలీస్ అధికారులు మాలకొండయ్య, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు

● విశాఖ సీఎస్ఆర్ఎంవోగా డీఎంహెచ్‌వో శ్రీహరి బదిలీ
● ఆయన స్థానంలో బాలకృష్ణ నాయక్ నియామకం



బాలకృష్ణ నాయక్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం శనివారం బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా తిరుపతి డీఎంహెచ్‌వో డాక్టర్ యు.శ్రీహరిని విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవోగా బదిలీ చేసింది. నగరి ఏరియా ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్‌ను తిరుపతి డీఎంహెచ్‌వోగా నియమించింది. చంద్రగిరి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ డి.టి.సుధారాణిని చిత్తూరు డీఎంహెచ్‌వోగా నియమించింది. రుయాస్పత్రి సీఎస్ఆర్ఎంవోగా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.సుబ్బలక్ష్మమ్మను నియమించింది. ఎస్వీ వైద్య కళాశాల ఆర్‌ఎంవో డాక్టర్ జే.రామాంజనేయులును కడప క్యాన్సర్ సెంటర్ సీఎస్ఆర్ఎంవోగా బదిలీ చేసింది.



ప్రత్యేక కథనం.. 8లో

లెక్కలు లేని బతుకును ఊహించలేం. అన్నింటికీ లెక్కలే ముడిపడి ఉంటాయి. జనాభా లెక్కలు మొదలు కరోనా సమయంలో వ్యాప్తిని సైతం గణాంకాల ద్వారానే గుర్తించాం. అంతేకాదు ఇప్పటి పోటీ ప్రపంచంలో లెక్కల్లో పట్టు సాధించిన వారే వివిధ రంగాల్లో రాణించగలుగుతున్నారు. అకడమిక్ నుంచి ఉద్యోగ పరీక్షల వరకూ లెక్కలే కీలకపాత్ర పోషిస్తున్నాయి. తమిళనాడులో పేదరికంలో పుట్టినా లెక్కల్లో ప్రపంచ పేరుగాంచాడు రామానుజన్. ఈయన జన్మదినాన్ని (డిసెంబరు22వ తేదీ) మ్యాథ్స్ దినంగా నిర్వహించుకుంటున్నాం.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం


శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

పాకాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని గణిత శాస్త్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా మాట్లాడుతూ గణిత శాస్త్రాభివృద్ధికి ఆర్యభట్ట, శ్రీనివాసరామానుజన్‌లు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. ఆధునిక పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే గణితంపై పట్టుసాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈశ్వరబాబు, అధ్యాపకులు మాశిలామణి, మాదవి, రేఖ, విష్ణు ప్రియ విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. పెరటాసి నెల మూడవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు.అనంతరం తిరుచ్చి వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న మోహిత్

చంద్రగిరి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. చంద్రగిరిలోని స్థానిక టవర్ క్లాక్ వద్ద వైసీపీ నాయకులు బాణసంచా కాల్చి, కేక్ కట్ చేశారు. తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.●పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అల్పాహారం పంపిణీ చేశారు. ●భాకరాపేట: భాకరాపేటలో మోహిత్ రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు.●తిరుపతి రూరల్: దుర్గసముద్రంలోని అక్షయక్షేత్రంలో వృద్ధులు, ప్రత్యేకప్రతిభావంతుల మధ్య మోహిత్‌రెడ్డి హాజరైకేక్‌ని కట్‌చేశారు. ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయ నిర్మాణానికి విరాళం

చంద్రగిరి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీలో కాలనీవాసులు నాగాలమ్మ ఓంశక్తి అమ్మవారి ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. అమ్మవారికి ఆలయ నిర్మాణానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఐరాల లోకేష్‌రెడ్డి రూ.40 వేల విలువ గల సిమెంట్, కమ్మి వితరణ చేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణానికి తనవంతు విరాళం అందించడాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిందర్, హేమంత్ రెడ్డి, అక్బర్, శివబాలాజీ, మనోజ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోటకాడపల్లి సదస్సుకు 60 అర్జీలు



ఎర్రావారిపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి విన్నపాన్ని పరిశీలించి పరిష్కారిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెఎం రోష్మాండ్ చెప్పారు. కోటకాడపల్లి పంచాయతీలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ పరమేశ్వరస్వామి మాట్లాడుతూ వీలున్న సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు ఆలుగంటి నిరంజన్ మాట్లాడుతూ తమ పంచాయతీలోని ఎస్సీఎస్టీలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. సదస్సులో 60 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంపూర్ణమ్మ, సిద్దలగండి నీటిసంఘం చైర్మన్ వెంకటరమణ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తిని బంధువులకు అప్పజెప్పిన గ్రామస్తులు

రామచంద్రాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శబరిమలై నుంచి సహచరులతో వస్తూ దారి తప్పిన ఓ వ్యక్తిని పోలీసులు అతని బంధువులకు అప్పజెప్పారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం పిడిమందసకు చెందిన దుర్యోధన గర్గు ఇటీవల గ్రామంలో కొందరితో కలిసి శబరిమలై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కాణిపాకం వచ్చారు. అక్కడకు వచ్చే సరికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో దారితప్పాడు. ఈక్రమంలో నడుచుకుంటూ రామచంద్రపురం మండలం ప్రసన్న వెంకటేశ్వరపురానికి చేరుకున్నాడు. గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇతడిని స్థానికులు ప్రశ్నించారు. అదే సమయంలో తన బంధువు ఫోన్ నంబర్ చెప్పాడు. దీంతో గ్రామస్తులు ఫోన్ చేసి ఇతడి వివరాలు తెలియజేశారు. అప్పటికే ఈ పరిసరాల్లో వెతుకుతున్న బంధువులు చంద్రగిరి పోలీసులను తీసుకుని చేరుకున్నారు. బంధువులను గుర్తుపట్టిన దుర్యోధన కన్నీరు పెట్టుకున్నాడు. గ్రామస్తులు ఆవ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పచెప్పారు.

జపాన్ సంస్థతో ఎస్వీయూ ఎంవోయూ



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జపాన్‌కు చెందిన బొయామా ప్రిఫెక్చర్ సంస్థతో ఎస్వీ యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. విజయవాడలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పరస్పర సహకారానికి ఈ ఒప్పందం చేసుకున్నట్లు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రీసెర్చ్ డీన్ నరసింహారావు, జపాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేత దుర్మార్గం

భాకరాపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట సర్పంచ్ భూపాల్‌కు చెందిన మామిడి మొక్కలను నరికి వేయడం దుర్మార్గమని చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చెట్లను తొలగించి ఫెన్సింగ్‌ను విరిచేశారు. ఈ విషయం తెలుసుకున్న మోహిత్ రెడ్డి శనివారం ఆ చెట్లను పరిశీలించారు. అనంతరం సీఐని కలిసి చెట్లు నరికి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

భాకరాపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లులో 'రాస్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రొంపిచెర్ల మండలం ఫజులపేటకు చెందిన చెన్నూరు బాలసుబ్రహ్మణ్యం, రాఘవేంద్ర, మురుగమ్మలు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సూపర్‌వైజర్ లక్ష్మీపతి నాయుడు పాల్గొన్నారు.

దీర్ఘకాల భూ వివాద ఫిర్యాదులతో సతమతం


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామాంజులునాయక్, ఆర్ఐ రఘువర్మ తదితరులు

తిరుపతి రూరల్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దీర్ఘకాలిక భూవివాద అర్జీలతో అధికారులు సతమతమవుతున్నారు. 1950-60 సంవత్సరాల్లో పూర్వీకుల డాక్యుమెంట్లను తెచ్చి తమ పేరుపై మార్చాలని ఎక్కువ మంది రైతులు కోరుతున్నట్లు తెలిసింది. వాటికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు లేకపోవడం వల్ల పరిష్కారం సాధ్యపడడంలేదని సమాచారం. భూమి పొజిషన్ కోసం, నోషనల్ ఖాతాలు వంటి సమస్యలతో అర్జీలను రోజూ అందిస్తున్నారు. నోషనల్ ఖాతాను నిర్ధారించినా ఇతరుల అనుభవంలో ఉండడం, ఇదేభూమికి మరొకరు కూడా డాక్యుమెంట్ కలగి ఉండడం వంటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. నోషనల్‌ఖాతా సమస్య ఉన్నవాటిని జేసీకి ప్రతిపాదనలు పంపి పరిష్కారానికి కృషి చేస్తున్నామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. సదస్సుల ద్వారా పరిష్కరించగలిగే ఫిర్యాదులు 20-30 శాతం వరకు మాత్రమే ఉంటున్నాయని, దీర్ఘకాల వివాదాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. గతంల్యో అధికారులు ఒకరి భూమిని వేరేవారి ఆన్‌లైన్‌లో పొందుపరచి తప్పిదాలు చేశారని, దీనిపై అప్పట్లో తహసీలార్లు కనీసం పరిశీలించకుండా డిజిటల్ సంతకం కూడా చేశారని పలువురు రైతులు వాపోతున్నారు.

మల్లంగుంటలో అక్కడికక్కడే పరిష్కారం

మల్లంగుంటలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో 14 అర్జీలు అందాయి. నోషనల్‌ఖాతాకు సంబంధించి 5 అర్జీలు అందాయి. గ్రామానికి చెందిన దొడ్ల మునస్వామి భూమి పొరపాటున ఆన్‌లైన్‌లో పార్లపల్లె బలరామిరెడ్డి పేరిట నమోదైంది. తహసీల్దార్ రామాంజులు నాయక్ .సమక్షంలో ఇరువురి అంగీకారంతో సమస్యను వెంటనే పరిష్కరించారు. టీడీపీనేతలు పార్లపల్లె మునికృష్ణారెడ్డి, అవిలాల దిలీప్‌కుమార్ యాదవ్, ఆర్ఐ రఘువర్మ, వీఆర్వో యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులు మొగ్గు చూపాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు

భాకరాపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులు మొగ్గు చూపాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు సూచించారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎడంవారిపల్లెలో సమీకృత వ్యవసాయ పద్ధతులపై మహిళా రైతు సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సంఘటితంగా వ్యవసాయం చేయడం వల్ల కూలీల కొరత ఉండదన్నారు. పంటలు మార్కెటింగ్ చేసి అధికంగా ఆదాయం పొందవచ్చునన్నారు. నూతన వంగడాలు, నూతన వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్నారు. రసాయనికి ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జీవామృతాలతో చీడపీడలు నివారించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించడం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, డీపీఎం ధనుంజయరెడ్డి, ఉద్యాన అధికారిణి శివకుమారి, ఏపీఎంలు స్వర్ణలత, ద్రాక్షాయిని, సీసీలు శివశంకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది ముసుగులో చోరీ

● 202 గ్రాముల బంగారు నగలు, రూ.20 వేల నగదు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ సిబ్బంది పేరుతో ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన శనివారం తిరుపతి రూరల్ కేశవాయనగుంటలో చోటు చేసుకుంది. క్రైం డీఎస్పీ రమణకుమార్ వివరాల మేరకు.. కేశవాయనగుంటకు చెందిన రమణయ్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వెళ్లాడు. అతని భార్య ధనమ్మ ఒక్కటే ఇంట్లో ఉండగా కర్ణాటక రిజిస్ట్రేషన్ ఉన్న రెండు ద్విచక్ర వాహనాల్లో ముగ్గురు వ్యక్తులు వెళ్లారు. తాము మున్సిపల్ ఆఫీసు నుంచి వస్తున్నామని, ఇంటి కొలతలు తీసి పన్ను నిర్ణయించాలని చెప్పారు. ఇద్దరు వ్యక్తులతో ఆమె మాట్లాడుతుండగా మూడో వ్యక్తి ఇంట్లోకి వెళ్లి కప్‌బోర్డులో ఉంచిన 202 గ్రాముల బంగారు నగలు, రూ.20వేల నగదు తీసుకుని పారిపోయాడు. తర్వాత మిగిలిన ఇద్దరూ అక్కడి నుంచి జారుకున్నారు. వెంటనే తేరుకున్న ధనమ్మ ఈ విషయాన్ని భర్తకు ఫోన్ ద్వారా చెప్పింది. ఆయన తిరుపతి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీ రమణకుమార్ సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. వీరు గతంలో తిరుపతి ఈస్ట్, 2023లో అలిపిరి పరిధిలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. కర్ణాటక రాష్ట్రం భద్రావతికి చెందిన బొరివి గ్యాంగ్‌గా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహనా కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో సైబర్ సెక్యూరిటీపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తిరుపతి శాఖ - వర్సిటీ కల్చరల్ అఫైర్స్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, సైబర్ నిపుణుడు నరసింహరావు, కల్చరల్ కో-ఆర్డినేటర్ వివేక్ పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాల బారిన పడకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనవసరమైన ఫోన్లకు, మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. మెయిల్, వాట్సప్, ఫేస్‌బుక్, స్మార్ట్‌ఫోన్ల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కృష్ణమ్మ, ప్రొఫెసర్ లక్ష్మమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


రవితేజ (ఫైల్)

రేణి గుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ ఘటన రేణిగుంటలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పాత చెక్‌పోస్టు వద్ద నివాసం ఉంటున్న రవితేజ (28) పూణేలో ఉద్యోగం చేసేవాడు. అక్కడ ఉద్యోగం మానేసి తల్లి దండ్రుల వద్ద ఉంటున్నాడు. ఏమైందో ఏమో శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

ఒకరికి రిమాండ్


ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

నారాయణవనం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. నారాయణవనానికి చెందిన రమణ కుమారుడు వినోద్ అలియాస్ దినేష్ నారాయణవనం, వడమాలపేట, పుత్తూరులో ఉన్న నిరుద్యోగులను గుర్తించి, వారికి కోర్టులో ఉద్యోగాలు తీసిస్తానని నమ్మించాడు. వారి నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశాడు. ఫిర్యాదులు అందడంతో నిందితుడిని శనివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కోర్టు అతడిని రిమాండ్‌కు ఆదేశించింది. దీంతో కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

లైంగిక వేధింపుల చట్టం పటిష్టంగా అమలు కావాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీతాకుమారి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయవలసిన అవసరం ఉందని పద్మావతి మహిళా యూనివర్సిటీ లా విభాగ ప్రొఫెసర్ సీతాకుమారి పేర్కొన్నారు. వర్సిటీ హ్యూమనిటీస్ సెమినార్ హాల్లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలపై విద్య, ఉద్యోగ కేంద్రాల్లో లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. వీటి కట్టడికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. అయినా పూర్తిగా లైంగిక వేధింపులు ఆగడం లేదన్నారు. ఇందువల్ల చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీన్ వాణి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉమాదేవి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ వాసంతి, అధ్యాపకులు సుచరిత, పద్మావతి, రాణి, మాధురి, సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

సహపంక్తి భోజనం.. స్త్రీ శక్తి ఉద్బోధనం!

●కుప్పంలో భువనేశ్వరి 3వ రోజు పర్యటన తీరూతెన్ను


విజలాపురం కేజీబీవీలో విద్యార్థినులతో సహపంక్తి భోజనం

కుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు అక్రమ కేసులో జైలుకు వెళ్లినప్పుడు పోరాడింది స్త్రీలే. వారి శక్తి అపారం. వారు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు.' అని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటనలో మూడవ రోజైన శనివారం రామకుప్పం, శాంతిపురం మండలాలలో విస్తృతంగా పర్యటించారు. చిన్నారులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామీణ మహిళలతో, డ్వాక్రా సంఘాలతో మమేకమై, వారి శక్తిని వారికి గుర్తు చేశారు. మహిళలు తలచుకుంటే కాని కార్యాలు ఏవీ ఉండవని, ఆర్థికంగా విజయం సాధించిన డ్వాక్రా సంఘాలు, హెరిటేజ్ సంస్థను నడుపుతున్న తానే నిదర్శమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) రూ.85 లక్షలను లబ్ధిదారులకు అందజేశారు. డ్వాక్రా సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు.కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆమె రామకుప్పం మండలం మొద్దులవంక గ్రామానికి ఉదయం 11.30 గంటలకు చేరుకుని అక్కడ మహిళలతో ముఖాముఖి సమావేశమయ్యారు. అయిదేళ్ల పాటు అరాచక పాలన సాగించి తమపై వివక్ష చూపిన గత ప్రభుత్వంనుంచి కుప్పానికి విముక్తి కలిగించడానికి చంద్రబాబును గెలిపించుకుని మహిళలు విజయం సాధించారన్నారు రాబోయే అయిదేళ్లలో కుప్పాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసి, దేశానికి ఆదర్శంగా నిలపడం చంద్రబాబుతోపాటు ఆయన కుటుంబంగా తమవంతు బాధ్యతని హామీ ఇచ్చారు. ప్రభుత్వపరంగానే కాక, ఎన్టీఆర్ ట్రస్టు తరఫున కుప్పంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం విజలాపురంలో కస్తూర్బా విద్యాలయానికి వెళ్లి, అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. వారితో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం శాంతిపురంలోని నందిగం కళ్యాణ మండపం చేరుకుని, డ్వాక్రా సంఘాలతో మమేకమయ్యారు. మగవాళ్లకన్నా వేయిరెట్లు ఆడవాళ్లు శక్తివంతులని, వారు ఒక పని చేస్తే, స్త్రీలు పది పనులు ఒక్క చేతితో చక్కబెట్టగలరని కితాబునిచ్చారు.శాంతిపురం వెలుగు మండల మహిళా సమాఖ్యకు రూ.6.70 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. 2019లో విద్యుత్తు ప్రమాదంలో మరణించిన సి.బండపల్లెకు చెందిన రైతు ఆర్.రామచంద్ర భార్య జ్యోతికి రెస్కో తరఫున రూ.5 లక్షలు చెక్కు పంపిణీ చేశారు. మంత్రి నారా లోకేశ్ సతీమణి, స్వయానా కోడలు అయిన నారా బ్రాహ్మణి జన్మదినాన్ని పురస్కరించుకుని మహిళలతో కలసి కేక్ కట్ చేశారు. మొరసనపల్లెలో కూడా మహిళలతో ముకాముఖి సమావేశమై వారితో సంభాషించారు.సాదకబాధకాలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.అనంతరం భువనేశ్వరి కుప్పంలోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని, 13మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.85 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. సాయంత్రం 6.45 గంటలకు కార్యక్రమాలన్నీ ముగించుకున్న నారా భువనేశ్వరి పీఈఎస్ వైద్య విద్యాలయం గెస్ట్ హౌస్‌కు చేరుకుని బస చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, రామకుప్పం, శాంతిపురం మండలాల పార్టీ అధ్యక్షులు ఆనంద రెడ్డి, విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి పోటీలకు జూడో జట్టు ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆదివారం జిల్లాస్థాయి జూడో పోటీలు నిర్వహించనున్నారు. తిజిల్లా జూడో సంఘం కార్యదర్శి జగదీష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌జూనియర్, క్యాడెట్, సీనియర్ జట్ల మధ్య జిల్లాస్థాయి పోటీలు జరగనున్నాయి. ఇందులో. ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈనెల 27నుంచి 29వరకు గంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతసాధిస్తారు. ఆసక్తిగలవారు ఆధార్, జననధృవీకరణ పత్రం వెంటతీసుకొని ఉదయం 9గంటలకు హాజరుకావాల్సివుంది. మరిన్ని వివరాల కోసం 9701299908నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి సేవలో జార్ఖండ్ సీఎం


హేమంత్ సోరెన్ - గల్లా జయదేవ్ - జస్టిస్ పొంగియప్పన్

తిరుమల, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం సాయంత్రం జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ దర్శించుకున్నారు. మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పొంగియప్పన్ ఆలయం ముందు జరిగిన సహస్రదీపాలంకార సేవలో పాల్గొన్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో మాజీ ఎంపీ గల్లా జయదేవ్, ఎమ్మెల్యే ఆదిమూలం స్వామిని దర్శించుకున్నారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ శనివారం రాత్రి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.

మురుగు నీటి సమస్యపై సీపీఎం ధర్నా

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మురుగు నీటి సమస్యను అధికారులు పరిష్కరించాలని సీపీఎం నాయకులు టి.సుబ్రమణ్యం, వేణులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కొర్లగుంట కూడలిలో వీరు నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొర్లగుంట జంక్షన్ నుంచి మార్కెట్ రోడ్డులో మురుగునీరు నిత్యం ప్రవాహంలా పారుతున్న అధికారుల్లో స్పందన లేక పోవడం శోచనీయమన్నారు. పలుకాలనీల్లో యూడీఎస్ పైప్‌లైన్ల నుంచి మురుగునీరు ప్రవహిస్తోందని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా స్పందన కరువైందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జి,చిన్నా,రవి,భగత్,రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యసేవలు

● సిబ్బందికి ఈఎస్ఐ రాష్ట్ర డైరెక్టర్ సూచన


ఆంజనేయులుకు సిబ్బంది వినతిపత్రం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈఎస్ఐ రాష్ట్ర డైరెక్టర్ ఆంజినేయులు వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిని ఆయన శనివారం ^నిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఆయన ఆస్పత్రిలోని వార్డులను, మందులను పరిశీలించారు. అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు ఆర్ఎంవో డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పీఏగా దుర్గాప్రసాద్?



కుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి (పీఏ)గా దుర్గాప్రసాద్‌ను నియమించినట్లు తెలుగుదేశం పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కుప్పం పర్యటనలో ఉన్న నారా భువనేశ్వరిని శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో దుర్గాప్రసాద్ అనే వ్యక్తి కలిసి మాట్లాడారు. ఆమె జాగ్రత్తగా పనిచేసుకోవాలని, ఆయనకు సూచించారు. జన నాయకుడు పోర్టల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ సంభాషణ జరిగింది. అక్కడున్న పార్టీ వర్గాలను ఆరా తీయగా, దుర్గాప్రసాద్ అనే వ్యక్తి విజయవాడ ప్రాంతంనుంచి వచ్చారని, ముఖ్యమంత్రి చంద్రబాబే ఆయనను స్వయంగా కుప్పం పంపించారని చెప్పారు. సీఎం పీయేగా దుర్గాప్రసాద్‌ను పేర్కొన్నారు. అయితే ప్రస్తుతానికి ఆయనను ట్రయల్ రన్ మీద కుప్పం పంపించారని, పనితీరు చూసిన తర్వాత సీఎం పీయేగా అధికారికంగా నియామకం జరుగుతుందని తెలిసింది. కాగా 1989లో చంద్రబాబు కుప్పం ఎమ్మెల్యేగా ఉన్నప్పటినుంచీ పి.మనోహర్ ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈయన తిరుపతినుంచి ఇక్కడికి వచ్చారు. అయితే ఎన్నికల ముందు మనోహర్ హఠాత్తుగా అనారోగ్యంపాలు కావడంతో చంద్రబాబు ఆయనకు విశ్రాంతినిచ్చారు. అప్పటినుంచీ పార్టీ కార్యాలయానికి, వ్యవహారాలకు దూరంగానే ఉంటూ వస్తున్న మనోహర్, సుమారు రెండు నెలలనుంచీ చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయానికి ఆఫీసు వేళల్లో వచ్చి తనపని తాను చూసుకుని వెళ్తున్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

చిత్తూరు జిల్లా, డిసెంబర్ 21: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స అందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. చిత్తూరు జిల్లా, తిరుపతిలో రామానుజ సర్కిల్, తిరుచానూర్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ పైన, హోటల్ మీనాక్షి నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబరులో సంప్రదించాలన్నారు.



కొత్త సంవత్సర డైరీ ఆవిష్కరణ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన కొత్త సంవత్సర డైరీని శనివారం ప్రజారవాణాధికారి జగదీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీపీటీవోను సన్మానించారు. నాయకులు డిప్యూటీ సీఎంఈ నరసింహులు, ఇంచార్జ్ సీటీఎం విశ్వనాథం, పీవో సహజాద్, ఇతర ఉద్యోగులకు డైరీలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఆవుల ప్రభాకర్‌యాదవ్, కార్యదర్శి ఈ.ఆర్.కుమార్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.మస్తాన్, జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరి మల్లిఖార్జున, దలవాయి గురునాథం, తాండాయం సత్యనారాయణ, శ్రీతీష్‌నాయుడు, ఏబీఎస్ మణ్యం, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప, కె.ఆర్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదిక రిజిస్ట్రేషన్ ప్రారంభం

తిరుపతి(లీలామహల్), డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్రహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించినట్లు తిరుపతి బ్రహ్మణ సమాజం కన్వీనర్ ఎన్.నరసింహులు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 16న తిరుపతి బ్రహ్మణ సమాజం ఆధ్వర్యంలో భైరాగిపట్టెడ వద్ద గల శ్రీవైఖానస కళ్యాణ వేదికలో పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం నుంచి జనవరి 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకున్న వివరాలు మాత్రమే పుస్తక రూపంలో అందుతాయన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9030177388, 9949339851 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో అక్షింత నాగరాజు, వేదం హరిప్రసాద్, మహేష్, అశోక్, వెంకటపెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



చిన్నారులతో కరస్పాండెంట్ రామకృష్ణారెడ్డి తదితరులు

తిరుపతిరూరల్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): భైరాగిపట్టెడలోని వీక్ష దిస్కూల్‌లో శనివారం ముందస్తుగా జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా పలువురు చిన్నారులు గణిత చార్ట్‌లను రూపొందించి ప్రదర్శించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కరస్పాండెంట్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, హెచ్‌ఎం విమల, డాక్టర్ వెంకటేశ్వర్లు, శశియాదవ్, రమేష్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

నేడు గణిత జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ గణిత విభాగంలో ఆది, సోమవారాల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. గణితం-అన్వయం - 2024 పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మ్యాథ్స్ గ్యాలరీలో ప్రారంభిస్తారు. ఇందులో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, వరంగల్ నిట్ ప్రొఫెసర్ రాధాకృష్ణమాచార్య, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, పాల్గొంటారు. సదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పరిశోధనా పత్రాలు సమర్పిసారని. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ సి. జయసుబ్బారెడ్డి తెలిపారు.

జేసీఐ తిరుపతి అధ్యక్షుడిగా శేషసాయి



జేసీఐ కార్యవర్గానికి అభినందన

తిరుపతి అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జేసీఐ) తిరుపతి కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షుడిగా శేషసాయి, కార్యదర్శిగా దిలీప్‌కుమార్, కోశాధికారిగా దిలీప్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, జేసీఐ జాతీయ అధ్యక్షులు భరత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం సేవాకార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు మనోహర్, ప్రమోద్‌కుమార్, కృష్ణమూర్తి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులకు ఇస్త్రీ పెట్టెల వితరణ



కార్మికులకు ఇస్త్రీ పెట్టెలను పంపిణీ చేస్తున్న దృశ్యం

మంగళం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 40మందికి వలస కార్మికులకు సేరా సంస్థ ఆర్థిక సహకారంతో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఇస్త్రీపెట్టెలను వితరణ చేశారు. శనివారం స్థానిక యూత్‌హాస్టల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.ఎస్.శోభన్‌బాబు హాజరై ఎల్పీజీ ఇస్త్రీ పెట్టెలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వీటిని సక్రమంగా వాడుకోవాలని, తక్కువ సమయంలో ఎక్కువ బట్టలు ఇస్త్రీ చేయవచ్చని, విద్యుత్, బొగ్గులతో పనిలేదన్నారు. మహిళాపోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీలత, లేబర్ ఆఫీసర్ రాజయ్య ,రూరల్ డీఆర్‌డీఏ ఏపీఎం నాగేశ్వరరావు, సెర్ప్ కార్యదర్శి మరుపూరి హేమశేఖర్, మాస్‌సంస్థ అధ్యక్షులు జ్ఞానశేఖర్‌రెడ్డి, ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షులు స్వాతి, తేజావతి, మధురిమ, హరి, మునిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆ కాలేజీలపై చర్యలు తీసుకోండి



వీసీకి విన్నవిస్తున్న ఆర్కే నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రాయలసీమ, ఈశ్వర్‌రెడ్డి, అంబేడ్కర్ లా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నేత ఆర్కే నాయుడు కోరారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడును కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. తమిళనాడు, కేరళ విద్యార్థులను చేర్చుకొని లక్షలాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇందుకు అధికారుల అండదండలు ఉన్నాయన్నారు. వైవా, రికార్డ్సు పేరుతో పెద్ద ఎత్తున విద్యార్థుల నుంచీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై విచారణ చేపట్టిన బాధ్యులైన కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

▪ పట్టించుకోండి సారూ

ఎస్ఎల్‌వీ నగర్‌లో గుంతలతో ఇబ్బందులు



→ ఎల్ఎల్‌వీ నగర్ చివరన దెబ్బతిన్న రోడ్డు

తిరుపతి(జీవకోన), డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని మానస సరోవర్ హోటల్ సమీపంలోని ఎల్ఎల్‌వీ నగర్‌లోని రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. ప్రధాన రహదారిలో గుంతలు ఏర్పడి వాహనచోదకులకు పరీక్షపెడుతున్నాయి. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక చిన్నపాటి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని అధికారులు కోరుతున్నారు.

పైపులు పూడి... మురుగునీటి దుర్గంధం





బడి వైన్‌షాపు పక్కన స్తంభించిన డ్రైనేజి.. దాలిమల్లి పొలాల్లో ప్రవాహం

తిరుపతి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరకంబాడిరోడ్డులోని బడి వైన్‌షాపు పక్కన డ్రైనేజీ పైపులు స్తంభించి మురుగునీరు బయటకు ప్రవహిస్తోంది. నెలరోజులుగా పరిస్థితి దారుణంగా ఉంటున్నా నగరపాలక పారిశుధ్య విభాగం పట్టించుకోవడంలేదని ఆరోపలున్నాయి. ఆ ప్రాంతమంతా దుర్గంధం నెలకొంది. పచ్చటి పొలాల్లోకి డ్రైనేజీ పారుతోంది. గోవుల కోసం పెంచే కసువు మొక్కలపై నుంచి ఈ మురుగు పారుతోంది. డ్రైనేజీ పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి మురుగుకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వాహన చోదకులకు తప్పని తిప్పలు



పెద్దకాపువీధిలో గుంతలు తేలినరోడ్డు

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దకాపువీధి కూడలిలో ఇటీవల నెలరోజుల ముందు వేసిన తారురోడ్డు కంకరతేలిపోయి గుంతలమయంగా తయారైంది. ఇదే మార్గంలో బండ్లవీధి వద్ద పలుచోట్ల ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నచిన్న కంకర రాళ్లు, స్టోన్‌డస్ట్ తేలిపోయాయి. చిన్నపాటివర్షానికి, షాపులని శుభ్రం చేసిన నీరు ఈగుంతలోకి చేరడంతో అటువైపుగా ప్రయాణించే వాహనచోదకులు, పాదాచారులు ఇబ్బందిపడుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు



మొక్కలతో ప్రమాదకరంగా దర్శనమిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి(కపిలతీర్థం),డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): కపిలతీర్థం రోడ్డులోని రామచంద్రనగర్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా తయారైంది. దీని చుట్టూ మొక్కలు ఏపుగా పెరిగాయి. సమీపంలోనే పాడిపశువులు సంచరిస్తుంటాయి. ప్రమాదం జరగకమునుపే సంబంధింత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న మొక్కలను తొలగించి కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల ఖర్చు పేరిట ఫేక్ బిల్లులు

● కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన అధికారులు

● కమిషనర్ ఆగ్రహం- సగమే చెల్లించాలని ఆదేశం

ఈఏడాది సార్వత్రిక ఎన్నికల బిల్లుల చెల్లింపులో కాంట్రాక్టర్లతో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు(డీటీ) చేతులు కలిపారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుపతి నియోజకవర్గంలో ఫేక్ బిల్లులతో నిధులను స్వాహా చేసేందుకు యత్నించడాన్ని మున్సిపల్ కమిషనర్ మౌర్య గుర్తించినట్లు తెలిసింది. కొన్ని సంస్థలను పక్కనపెట్టి కొన్నింటికే కేటాయింపులు చేయడంపై కాంట్రాక్టర్లు ఇటీవల ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈక్రమంలో శనివారం అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డీటీలు అశోక్‌రెడ్డి, జీవన్, రామచంద్రయ్య, ఆర్ఐ జిలానీలను పిలిపించి విచారించారు. ఎన్నికల డీటీగా పనిచేసిన జీవన్ పాత్రపై అనుమానాలు వ్యక్తమైనట్లు తెలిసింది. నిధులను సమానంగా పంపిణీ చేయాలని ఆమె పేర్కొంటూ సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.

చంద్రగిరిలోనూ ఇదేతీరు

జిల్లాలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఖర్చుకు ప్రభుత్వం అక్టోబరు 15న రూ.22.77కోట్లు విడుదల చేసింది. ఇందులో తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు రూ.2.70కోట్లు కేటాయించారు. ఎన్నికల సమయంలో పలు పనులను ఏజెన్సీల ద్వారా చేశారు. నియోజకవర్గానికి రూ4.73కోట్లు ఖర్చు పెట్టినట్లు బిల్లులు సమర్పించారు. ఖర్చుచూపిన దాంట్లో దాదాపు 50 శాతం మాత్రమే చెల్లించడంతో కాంట్రాక్టర్లు ఆ ప్రకారమే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల కు పెట్టిన ఖర్చులను కూడా ఇందులోనే చూపించడం, వాహనాలకు, డీజిల్‌కు వేర్వేరుగా బిల్లులు పెట్టడం, ఏజెన్సీలు లక్షల్లో ఎన్నికలకు ఖర్చుపెట్టినట్లు బిల్లులు పెట్టినట్లు గుర్తించారని తెలిసింది. చంద్రగిరి నియోజకవర్గంలో కూడా ఇలాంటి అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లు పెద్దఎత్తున ఫేక్ బిల్లులు పెట్టినట్టు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే పలువురి బిల్లులను ఆపినట్టు తెలుస్తోంది. కొన్ని కాంట్రాక్ట్ ఏజెన్సీలు నాలుగు రెట్లు ఎక్కువ వేసి నకిలీ బిల్లులు పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. సమగ్రవిచారణ జరిపితే దొంగలు బయటపడే అవకాశం ఉంది.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఎస్వీజీపీటీకి ఓవరాల్ ఛాంపియన్‌షిప్

● ముగిసిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా ఎస్వీజీపీటీ జట్టు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బాయ్స్ రీజనల్ మీట్ 2024-25 ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను వేంకటేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు కైవసం చేసుకుంది. రెండు రోజులుగా ఎస్వీజీపీటీలో జరిగిన స్పోర్ట్స్ మీట్ శనివారం సాయంత్రం ముగిసింది. తుదిపోరులో ఎస్వీజీపీటీ జట్టు కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్ సింగిల్స్ చెస్‌లో విజేతగా, బాల్‌బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. అథ్లెటిక్స్‌లోనూఎస్వీజీపీటీ క్రీడాకారులు సత్తాచాటారు. వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌గా పుత్తూరుకు సమీపం పిల్లారిపట్టులోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎ.రోహిత్ ఎంపికయ్యాడు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పారిశ్రామికవేత్త పసుపులేటి శివప్రసాద్, గుంటూరు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీ.హెచ్.శైలజ, ఎస్వీజీపీటీ ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ ఆర్వీ రమణకుమార్, ఫిజికల్ డైరెక్టర్ కె.రాజీవ్, గౌరీశంకర్ కె.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆరోగ్యంపై మంత్రి ఆరా



రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు విన్నవిస్తున్న కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి అరవింద్ ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆరా తీశారు. ధర్మవరం ప్రాంతానికి చెందిన ఈ విద్యార్థి భవనం పై నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను స్థానిక బీజేపీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. అరవింద్‌కు మెరుగైన వైద్యం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు రిజిస్ట్రార్ భూపతి నాయుడును కలిసి శనివారం కలసి ఈ ఘటనపై తమకు పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక సబ్జెక్టులో ఫెయిల్ చేశారనీ, దీనికి మనస్తాపం చెందినట్టు ఆరోపించారు.

చోరీ కేసులో దంపతుల అరెస్ట్

● 38 గ్రాముల బంగారం, ఫోన్ స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళను బురిడీ కొట్టించి బంగారు చైను, మొబైల్ ఫోన్ లాక్కొని వెళ్ళిన కేసును తిరుపతి రూరల్ పోలీసులు ఛేదించారు. నిందితులైన భార్యాభర్తలను అరెస్టు చేసి 38 గ్రాముల బంగారు చైను, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ కథనం మేరకు....తిరుపతి రూరల్ వాణీనగర్‌లో ఉంటున్న నాగస్వాతి భర్త మధు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 18న అతను పిల్లలను తీసుకుని స్కూలుకు వెళ్ళాడు. ఇదే అదనుగా అగ్రహారం గ్రామానికి చెందిన బుడుగు ప్రసాద్, అతని భార్య వసంతలు వచ్చారు. ఇంటిలో ఒంటరిగా ఉన్న నాగస్వాతి కళ్ళలో కారం చల్లి 38 గ్రాముల బంగారు చైనుతోపాటు మొబైల్ ఫోన్ తీసుకుని పరారయ్యారు. బుడుగు ప్రసాద్ చెల్లెలు రోజారాణికి, నాగస్వాతిల మధ్య కొంతకాలంగా ఆర్థిక వివాదాలుతున్నాయి. ఈక్రమంలో నాగస్వాతిని భయపెట్టాలని భావించి రోజారాణి భావించింది. కుటుంబ సభ్యులతో కలసి పన్నాగం పన్నింది. అందులో భాగంగా బుడుగు ప్రసాద్,అతని భార్య కలసి. నాగస్వాతి ఇంటికి బంగారు చైను, మొబైల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది ఆరీఫ్, మధులు కలసి శనివారం నిందితులను అరెస్టు చేశారు.

ఘనంగా ఆత్మీయ వీడ్కోలు వేడుక



వేడుకల ప్రారంభంలో చదలవాడ క్రిష్ణమూర్తి

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట మార్గంలోని చదలవాడ దంత వైద్య కళాశాలలో శనివారం 2024-ఇగ్నైట్ వేడుకలు ఘనంగా జరిగాయి. బీడీఎస్ చివరి సంవత్సర విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని తిరుపతి మజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ ఛైర్మెన్ విద్యాసంస్థల అధినేత చదలవాడ క్రిష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం గర్వించే విధంగా దంత వైద్యంలో ఉత్తమ సేవలందించి విద్యార్థులు కీర్తి ప్రతిష్ఠలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ చంద్రశేఖర్,వైస్ ప్రిన్స్‌పాల్ శ్రీధర్‌లతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

25న జిల్లా రచయితల సంఘ తొలి వార్షికోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం తొలి వార్షికోత్సవం ఈనెల 25న తిరుపతిలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు యూత్ హాస్టల్‌లో కార్యక్రమం ప్రారంభం కానుంది. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు రాసిన ఇతిహాసాల్లో మహర్షులు-ధర్మప్రబోధాలు, అన్నమయ్య శ్రీవేంకటేశ్వ శతకం వంటి పుస్తకాలను తాళ్ళపాక హరినారాయణాచార్యులు ఆవిష్కరిస్తారు. సాహిత్యవేత్తలు కె. సర్వోత్తమరావు, ప్రతిమ, పల్లెపట్టు నాగరాజులకు పురస్కారాలను అందజేస్తారు. సభలో అవధాని మేడసాని మోహన్, ఆకెళ్ళ విభీషణ శర్మ, తదితరులు పాల్గొంటారు. తోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారు.

వన చైతన్య రథం మూగబోయింది



టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద మూలనపడ్డ ఎర్రచందనం వన చైతన్య రథం

శేషాచల కొండల్లోని ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎర్రచందనం వన చైతన్య రథం ప్రస్తుతం మూలనపడింది. అక్రమ రవాణా వల్ల కలిగే పరిణామాలపై అవగాహన కల్పించేందుకు 2019 ముందు ఐజీ క్యాడర్‌లో హెడ్ ఆఫ్ టాస్క్‌ఫోర్స్‌గా ఉన్న కాంతారావు దీన్ని ఏర్పాటు చేశారు. అటవీ సమీప గ్రామాలతో పాటు కూలీలుగా వస్తున్న తమిళనాడుకు చెందిన జవాదీ హిల్స్ పరిసర ప్రాంతాల్లోనూ ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేగాక టోల్‌ఫ్రీ నంబర్ ప్రచారం చేయడంతో ప్రజలు కూడా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం అందించేవారు. కాంతారావు బదిలీ తర్వాత ప్రచారానికి అవసరమైన నిధులు సమకూర్చే వారు లేకపోవడంతో ప్రచార రథం మూలనపడింది. ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంటూ తుప్పుపట్టే దశకు చేరింది. పైగా టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చేవారు కూడా కరువయ్యారు.

- మంగళం, (ఆంధ్రజ్యోతి)




సమ్మేమేంద్రతీర్థకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీవారిసేవలో కాశీ మఠాధిపతి

తిరుమల, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): వారణాశి కాశీ మఠాధిపతి సమ్మేమేంద్రతీర్థ స్వామి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకబృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్టును దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,299

తలనీలాలు సమర్పించినవారు: 20,297

నేడు జాతీయ గణిత దినోత్సవం

లెక్కలు అందమైన భవితకు రెక్కలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), తిరుపతిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మనిషి భూమి మీద పడినప్పటి నుంచే లెక్కలు మొదలవుతాయి. ఏ తేదీన పుట్టాడు. ఎన్ని గంటలకు పుట్టాడు లాంటి లెక్కలు ఆ క్షణం నుంచే ప్రారంభమవుతాయి. అందుకే జీవితమంతా లెక్కలతోనే ముడిపడి ఉంటుంది. కానీ విద్యాభ్యాసం ఆరంభంలోనే లెక్కలంటే చాలామంది విద్యార్థులను భయం వెంటాడుతుంది. ఇదో కొరుకుడుపడని అంశంగా భావిస్తారు. భవిష్యత్‌కు ఈ లెక్కలే సోపానాలని అప్పుడు గ్రహించరు. అయితే ఈ లెక్కలను అర్థం చేసుకుంటే దీనంత సులువు మరొకటి ఉండదంటారు గణిత నిపుణులు. లెక్కలను భయంతో కాకుండా ఆసక్తితో నేర్చుకోవాలని హితవు పలుకుతుంటారు. ప్రాథమిక స్థాయి నుంచే లెక్కలంటే ప్రతికూలతను దూరం చేయాలంటారు. మనసుపై ముద్ర పడేలా బోధిస్తే లెక్కలేమంత కష్టం కాదంటున్నారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో లెక్కలు రాకపోతే అన్నీచిక్కులే. మ్యాథ్స్ లేని పోటీ పరీక్ష కాని, ఉన్నత చదువుగాని ఉండదంటే అతిశయోక్తి కాదు. పొరుగున ఉన్న తమిళనాడులో పేదరికంలో పుట్టినా లెక్కల్లో ఘనాపాఠిగా పేరుగాంచాడు రామానుజన్. ప్రపంచంలోనే మన దేశానికే ప్రత్యేకగుర్తింపు తెచ్చిపెట్టాడు. ఈయన జన్మదినాన్ని (డిసెంబరు22వ తేదీ) మ్యాథ్స్ దినంగా నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా బాల్యం నుంచే లెక్కల్లో భళా అనిపించుకుంటున్న ఈ చిన్నారులేమంటున్నారో తెలుసుకుందాం.

గణిత విజ్ఞానంతో ముందడుగు



నిత్య జీవితంలో అనేక విషయాల్లో గణితాన్ని చూడవచ్చు. ప్రపంచ జనాభా సైతం గణితంలోనే విశ్లేషించుకోవలసి వస్తుంది. కరోనా వ్యాప్తి గణాంకాలను వివరించింది కూడా గణితమే. దూరాన్ని లెక్కల్లోనే కొలుస్తాం. ఇలా అన్నింటా కీలక పాత్ర పోషిస్తున్నందునే గణితానికి చాలా ప్రాధాన్యముంది. గణితం చదువుకున్న వారికి ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గణిత విజ్ఞానానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా జోడిస్తే మరిన్ని ఉన్నత అవకాశాలు దక్కే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షల్లోనూ రాణించడానికి గణితం చాలా ఉపయోగపడుతూ ఉంది. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా గణిత శాస్త్ర ప్రాముఖ్యత తగ్గకపోగా, పెరుగుతోంది.

- అనుపల్లె సుధాకరయ్య,
ఎస్వీయూనివర్సిటీ గణిత విభాగ ప్రొఫెసర్

చిన్నప్పటి నుంచి లెక్కలంటే ఇష్టం



తిరుపతి జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్యస్కూల్‌లో 8వతరగతి చదువుతున్నాను. ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్, నాలెడ్జ్ అసైన్‌మెంట్ పరీక్షల్లో బంగారు పతకాలు సాధించాను.

- వి.మోహిత్ వంశీరెడ్డి

గణితం వల్ల ఐఐటీలో సీటు



చిన్నప్పటి నుంచి గణితంపై చాలా మక్కువ. జాతీయస్థాయి సైనిక్ ప్రవేశపరీక్షల్లో గణితంలో 200కి 200మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్ పరీక్షల్లోనూ వంద శాతం పర్సంటైల్ సాధించా. హైదరాబాద్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదువుతున్నా. ఇదంతా లెక్కల్లో ఆసక్తి వల్లే సాధ్యమైంది.

- రోహిత్

ఒలింపియాడ్‌లో ఆరు పతకాలు



తిరుపతిలోని డాక్టర్ కిషోర్ రత్నం స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాను. ఇప్పటివరకు అంతర్జాతీయస్థాయి గణిత ఒలింపియాడ్‌లో ఆరుపతకాలు వచ్చాయి. గణితమంటే ఎంతో ఇష్టం. ఏటా గణిత ఒలింపియాడ్ పరీక్షలు రాస్తుంటాను. భవిష్యత్‌లో ఐఐటీ సాధనకు లెక్కలు ఉపయోగపడతాయనుకుంటున్నాను.

- షణ్ముఖప్రియ

అర్థం చేసుకుంటే ఈజీ



తిరుపతి మాతృశ్రీస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీపరీక్షలకు వెళ్తుంటాను. ఇటీవల ఇంటర్నేషనల్ గణిత ఒలింపియాడ్ పరీక్షని రాశాను. అర్థం చేసుకుని చదివితే లెక్కలకిమించిన ఈజీ సబెక్టు మరొక్కటి లేదు.

- ఎన్.గురుదీప్,
7వతరగతి, మాతృశ్రీస్కూల్

అంతర్జాతీయ పతకమొచ్చింది



ఏఐఆర్ బైపాస్‌రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాను. అంతర్జాతీయస్థాయి గణిత ఒలింపియాడ్ సెకండ్ లెవల్(ఫైనల్)లో బంగారు పతకాన్ని సాధించాను. నాలెడ్జ్ అసైన్‌మెంట్ పరీక్షలోనూ అత్యుత్తమ ప్రతిభతో పతకాన్ని పొందాను. గణితంపై ఉన్న ఇష్టంతో ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలనుకుంటున్నాను.

-వేదశ్రీ

సంక్రాంతికి 230 ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి పండుగలకు ఏపీఎస్ ఆర్టీసీ తిరుపతి కేంద్రంగా 230 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఇక్కడి నుంచి హైదరాబాదు, విజయవాడ, బెంగళూరుకు సర్వీసులు నడపనున్నట్లు ఇన్‌చార్జ్ డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం తెలిపారు. అమరావతి, ఇంద్ర, సూపర్‌లగ్జరి, అల్ట్రాడీలెక్స్, ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉంచామన్నారు. వచ్చేనెల 9నుంచి 13వ తేదీ వరకు రాను, 15నుంచి 17వ తేదీ వరకు పోను వేర్వేరుగా బస్సులు, వాటి రవాణా సమయాలను ఖరారు చేశామన్నారు. టిక్కెట్ల రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నట్లు వివరించారు.

22 మెమూ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 22 మెమూ ప్యాసింజరు రైళ్లను ఈ నెల 26 నుంచి రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీటీఎం కె.మణికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కాట్పాడి-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న 6, విశాఖపట్నం నుంచి రాజమండ్రి, పలాస, విజయనగరం మధ్య రాకపోకలు సాగించే 6, కాచిగూడ- మహబూబ్‌నగర్, నడుకుడి మధ్య 8, కాట్పాడి-జోలార్‌పేట మధ్య నడుస్తున్న 2 మెమూ ప్యాసింజర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇవి ఈ నెలాఖరు నుంచి ఫిబ్రవరి వరకు వారణాసిలో నిర్వహించే కుంభమేళా భక్తులకు సేవలు అందించనున్నాయని తెలిపారు. అలాగే చెన్నై సమీపంలోని పెరంబూరు ఐసీఎఫ్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి 22 రైలు పెట్టెలతో కూడిన 15 రైళ్లను పంపనున్నారని తెలిపారు. తిరుపతి నుంచి వారణాసి, అలహాబాదుకు కొన్ని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధూర్జటి కళాప్రాంగణం, స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవంలో పాల్గొనదల్చిన కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కళాకారులు దరఖాస్తులను పూర్తి వివరాలతో పాటు ఫొటో, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీని పొందుపరుస్తూ జనవరి 20వ తేదీలోపు దేవస్థానం కార్యాలయంలో కానీ ఆలయ ఈమెయిల్ ద్వారా గానీ పంపాల్సిందిగా కోరారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

10 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్‌తో కలిసి ఆయన సమీక్షించారు. సీఎం ఆదేశాల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఉత్సవం గురించి దేశ, ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఐదు ప్రాంతాల్లో నిర్వహించనున్న ఈ వేడుకలకు ఇన్‌చార్జి అధికారులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పులికాట్ సరస్సులో బోటు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, డీఎఫ్‌వో, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, ఏపీటీడీసీ ఈఈ సుబ్రహ్మణ్యం, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

నీలేష్‌కుమార్‌కు యంగ్ అచీవర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నీలేష్‌కుమార్

తిరుపతిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, తిరుపతికి చెందిన కుప్పాల నీలేష్‌కుమార్ యంగ్ అచీవర్స్ అవార్డు అందుకున్నారు. వర్సిటీకి చెందిన 1991-2024 బ్యాచ్ విద్యార్థులకు వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రో ఛాన్సలర్ డాక్టర్ పి.రవిల నేతృత్వంలో అవార్డులను ప్రదానం చేశారు. ఏపీ నుంచి నీలేష్‌కుమార్ ఈ అవార్డు అందుకున్నారు. ఈయన తిరుపతికి చెందిన కుప్పాల గిరిధర్ కుమారుడు.

ఉత్కంఠగా అరణియార్ సాగునీటి సంఘ ఎన్నికలు

● రవిరెడ్డికి దక్కిన చైర్మన్ గిరి



రవిరెడ్డి - విజయకృష్ణ

పిచ్చాటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అరణియార్ రిజర్వాయర్‌కు శనివారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా సాగింది. అధిష్టానం జోక్యంతో పిచ్చాటూరు టౌన్‌కు చెందిన రవిరెడ్డికి చైర్మన్ గిరి దక్కింది. వైస్ చైర్మన్‌గా నాగలాపురం మండలం కృష్ణాపురానికి చెందిన విజయకృష్ణ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా మొదటి నుంచి విజయకృష్ణను అనుకున్నారు. అయితే చైర్మన్‌గా నాగలాపురం పట్టణానికి చెందిన సెల్వకుమార్, పిచ్చాటూరు పట్టణానికి చెందిన రవిరెడ్డి మధ్య హోరాహోరీ పోరు జరిగింది. అధిష్టానం జోక్యంతో చెరి రెండున్నర సంవత్సరాల ఒప్పందంతో మొదటి రెండున్నర సంవత్సరాలు (ప్రస్తుతం) రవిరెడ్డి నియామకం జరిగింది. రవిరెడ్డిని ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి తన బృందంతో కలసి అభినందనలు తెలిపారు. అరణియార్ ప్రాజెక్టుకు ఐదుగురు ఆయకట్టు అధ్యక్షులు కాగా 60 మంది టీసీ మెంబర్లు ఉన్నారు. ఒక్కో అధ్యక్షుడిని 12 మంది టీసీ మెంబర్లు ఎన్నుకుంటారు. ఐదుగురు అధ్యక్షుల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడం పరిపాటి. ఎన్నికల అధికారిగా ఇరిగేషన్ ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్ర కుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశులు పాల్గొన్నారు.

72 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

● ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బియ్యం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని తిరుపతి రూరల్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం తనపల్లి ఇందిరమ్మ ఇళ్ల బ్లాక్ నెంబరు 22లో కాపురముంటున్న ఏ.రాజశేఖర్ తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో కార్డుదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి, తమిళనాడుకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రూరల్ సీఐ చిన్నగోవిందు పర్యవేక్షణలో ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలసి అతని ఇంట్లో తనిఖీలు చేపట్టారు. స్టాకు ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా దామెర



ప్రసాద్‌నాయుడు, శంకర్‌నాయుడులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా పెళ్లకూరు మండలం నెలబల్లి పంచాయతీ పరిధిలోని బీమవరం గ్రామానికి చెందిన దామెర ప్రసాద్ నాయుడు ఎన్నికయ్యారు. శ్రీకాళహస్తి ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికలో కమిటీ సభ్యులు పెళ్లకూరు మండలానికి చెందిన పాపాడి రాజగోపాల్‌రెడ్డి, వేలూరు హరినాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డిలతో పాటు బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఆలత్తూరు గ్రామానికి చెందిన గురవయ్య కలిసి చైర్మన్‌గా దామెర ప్రసాద్‌నాయుడిని ఎన్నుకున్నారు. తొట్టంబేడు మండలం గుమ్మడిగుంట గ్రామానికి చెందిన శంకర్‌నాయుడు వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి నీటిపారుదల శాఖ ఈఈ, ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం మంజుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పెళ్లకూరు మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్‌నాయుడు, మురళీనాయుడు, కృష్ణమనాయుడు, మునిరామయ్య, రవినాయుడు వారిని అభినందించారు.

రాక్షసుడితో రాజీ అబద్ధం

● తప్పుడు కథనాలు బాధాకరం
● వైసీపీ అరాచకాలను వదిలే ప్రసక్తే లేదు
● శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల పాటు ఒక నరరూప రాక్షసుడితో పోరాడాను. నాపై అక్రమంగా 19 కేసులు బనాయించాడు.. ఎన్నికైన రోజు నుంచే పాపాత్ముడి అరాచకాలపై అలుపెరగకుండా పోరాడుతున్నాను. వైసీపీ అక్రమాలను వెలికితీస్తున్నా.. తప్పులు చేసిన మాజీ ఎమ్మెల్యేతో సహా పలువురు వైసీపీ నాయకులపై కేసులు నమోదయ్యాయి.. ఇలా వైసీపీ అరాచక, అక్రమాలపై చర్యలు తీసుకుంటుంటే ఆ రాక్షసుడితో రాజీపడినట్లుగా కొందరు కథనాలు రాయడం మనస్సును తీవ్రంగా గాయపరుస్తోంది. రాక్షసుడితో రాజీ అబద్ధం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ రాజ్ అతిథిగృహంలో శనివారం పొద్దుపోయాక రాత్రి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిరోజు నుంచే రాజీవ్ నగర్‌లో వైసీపీ అక్రమ కట్టడాలను తొలగింపు చర్యలు చేపట్టామని, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేశామన్నారు. స్వర్ణముఖి నది ఒడ్డున రోడ్డును ఆక్రమించి చేసిన కట్టడాల తొలగింపునకు శ్రీకారం చుడితే మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హంగామా సృష్టించి అధికారులపై వీరంగం సృష్టించడంతో కేసు నమోదు అయినట్లు చెప్పారు. దక్షిణ కైలాసనగర్‌లో మాజీ ఎమ్మెల్యే బావమరిది ఆక్రమించుకున్న భూమిని సంబంధిత వ్యక్తులకు ఇప్పించిన విషయాన్ని తెలియజేశారు. రేణిగుంట మండలంలో వందల అక్రమ కట్టడాలను ఒకే రోజు తొలగించామని చెప్పారు. మున్సిపల్ పరిధిలో పలు అక్రమ కట్టడాలను గుర్తించామని అయితే ఇదివరకు పనిచేసిన కమిషనర్ రమేష్ బాబు వారిని కోర్టుకు వెళ్లేలా చేశారని తెలిపారు. దీనివల్ల ఆ అక్రమ నిర్మాణాల కూల్చివేత ఆగిందన్నారు. వైసీపీ ఆక్రమాలను ఏ ఒక్కటీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రెవెన్యూ సదస్సులు పూర్తయిన తర్వాత మళ్లీ మీడియా ముందుకొచ్చి నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ భూఆక్రమణల వివరాలను వెల్లడిస్తానని స్పష్టంచేశారు.

శ్రీసిటీలో టొయామా ప్రతినిధుల బృందం



శ్రీసిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని టొయామా రాష్ట్రానికి చెందిన 16 మంది సభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. టొయామా అసోసియేషన్ ఆఫ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హొకురికు బ్యాంక్ సీనియర్ సలహాదారు హిడెనోరి మగినో నేతృత్వంలో వచ్చిన బృంద సభ్యులకు శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని వారు అభినందించారు. భారత్, టొయామా మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పల్లె పండుగ పనులు వచ్చే నెలాఖరుకు పూర్తి కావాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా జిల్లాకు కేటాయించిన పనులు జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. పల్లె పండుగలో భాగంగా జిల్లాకు రూ.200కోట్ల విలువైన పనులు కేటాయించారని, ఇందులో 70 శాతం సంక్రాంతి నాటికి, మిగిలిన 30 శాతం జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 31 నాటికి అనిమల్ షెల్టర్స్ 900 పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్, ఎంపీడీవోలు, డ్వామా సహాయ ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

22.40 కిలోల గంజాయి స్వాధీనం

● ఏడుగురి అరెస్టు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి రైల్వేస్టేషన్ వద్ద 22.40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని ముళ్లపొదల వల్ల గంజాయి విక్రయిస్తున్న పట్టణానికి పెనుబర్తి గణేష్, యకసిరి చైతన్య, నక్కల నాని, లేబాకు జనార్దన, తంగా పేచిరాజ్, ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 22.40కిలో గంజాయిని, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.2,46,400 ఉంటుందన్నారు. అలాగే పట్టణంలోని గంజాయి సేవించే 30మందికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అదే విధంగా వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పెనుబర్తి గణేష్, యకసిరి చైతన్య, నక్కల నాని, లేబాకు జనార్దన్ వద్ద నుంచి 11 మోటర్ సైకిళ్లు, పది పొట్లాళ్లు, రూ.లక్ష స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పుత్తూరు వార్తలు

సెమీస్‌కు ఉమ్మడి చిత్తూరు బాలుర, బాలికల జట్లు

రసవత్తరంగా అండర్ -19 ఖోఖో పోటీలు



పుత్తూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో68వ రాష్ట్ర స్థాయి అండర్-19 ఖోఖో పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలుర, బాలికల జట్లు క్వార్టర్స్ ఫైనల్స్‌లో విజయసాధించి సెమీస్‌కు దూసుకెళ్లాయి.

నేడు సెమీఫైనల్స్

బాలికల విభాగంలో చిత్తూరు - అనంతపురం, ప్రకాశం - తూర్పు గోదావరి జిల్లాల జట్లు పోటీ పడనున్నాయి. బాలుర విభాగంలో చిత్తూరు-శ్రీకాకుళం, ప్రకాశం-విశాఖపట్నం జట్లు తలపడనున్నాయి. ఈ కార్యక్రమాలలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌నాయుడు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి జయరామయ్య, టోర్నమెంట్ అబ్జర్వర్ ఈశ్వర్‌నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, గోపీకృష్ణ, సుబ్రమణ్యంరెడ్డి, శరత్, నందకుమార్, లోకేశ్ పాల్గొన్నారు.

క్వారీల పేలుళ్లపై విచారణ జరపాలి



బొజ్జనత్తం గ్రామంలో పర్యటించిన తహసీల్దార్

పుత్తూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాత్రి పూట క్వారీలలో జరిపే పేలుళ్ల ధాటికి బొజ్జనత్తం గ్రామం లోని ఇళ్లు కంపించి గోడలు బీటలు వారుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఈశ్వరాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. అలాగే బొజ్జనత్తం గ్రామంలోని గుంట ఆక్రమణకు గురవుతోందని సర్వే చేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన తహసీల్దార్ సీపీఎం నాయకులతో నాయకులతో కలిసి ఆ గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వెంకటేశం, దళిత గిరిజన సంఘం కార్యదర్శి నందయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

పుత్తూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధ్యానం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులు నరసింహులు, జయరామయ్య, సురేష్‌బాబు, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుత్తూరు టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న రూ.3580 కోట్ల ఫీజు రీయింబెర్స్‌మంట్, ఉపకారవేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం స్థానిక ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, జిల్లా అధ్యక్షులు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని, ఫీజులు చెల్లించలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని గుర్తుచేశారు. జీవో నెంబర్ 77ని రద్దుచేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, నాయకలు సిద్ధార్థపూర్ణ, రాజు, ప్రవీణ్, రమేష్‌కుమార్, శ్రీను, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

● 142 కట్టడాలు నేలమట్టం



బేరివాణిగుంటలో కూల్చివేసిన నిర్మాణాలు

రేణిగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలపై అధికారులు కన్నెర్ర చేశారు. ప్రభుత్వ భూములు, గుంటలు, కాలువల స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చివేశారు. ఇలా మొత్తం 142 నిర్మాణాలను నేలమట్టం చేశారు. మండలంలోని ఆర్అగ్రహారం గ్రామంలోని బేరివాణిగుంట సర్వేనంబరు 535లో 8.48 ఎకరాల్లో 120 ఇళ్లు అక్రమంగా నిర్మించారు. కుర్రకాలువ గ్రామంలోని రాగిమాకులగుంట సర్వే నంబరు 15లో 4.84 ఎకరాల్లో 20 ఇళ్లు, సూరప్పకశం గ్రామంలో కాలువ పోరంబోకు సర్వేనంబరు 688లో 4.32 ఎకరాల్లో రెండు ఇళ్లు, కాంపౌడ్ వాల్ నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణాలన్నింటినీ శనివారం తెల్లవారుజామున ఉదయం 3 గంటల నుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేశారు. అలాగే చెంగారెడ్డిపల్లి, చెంగల్‌రాయులగుంట, కుర్రకాలువ పరిధిలోని పాకశాస్త్ర విశ్వవిద్యాలయం ముందు, వెనుక, తహసీల్దారు కార్యాలయ సమీపంలోనూ ఆక్రమణలను గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. అయితే ఈ అక్రమ నిర్మాణాలకు సంబంధించి కోర్టుకు వెళ్లినందున కూల్చివేత అలస్యం అవుతోందన్నారు. కోర్టు తీర్పు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ హయాంలో తక్కువ ధరల మాయలో పడి ఇళ్లను నిర్మించిన వారు ఇప్పుడు కూల్చివేతలతో లబోదిబోమంటున్నారు.



ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేతలు

బాధితుల నిరసన

కుర్రకాలువ గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో కూల్చివేతకు వ్యతిరేకంగా బాధితులు నిరసన తెలిపారు. దళిత, గిరిజన సంఘాల నాయకులతో కలిసి సదస్సు వద్ద బైఠాయించారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

చిత్తూరు జిల్లా, డిసెంబర్ 21: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స అందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. చిత్తూరు జిల్లా, తిరుపతిలో రామానుజ సర్కిల్, తిరుచానూర్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ పైన, హోటల్ మీనాక్షి నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబరులో సంప్రదించాలన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మూగబోయిన బీఎస్ఎన్ఎల్

తడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలో బీఎస్ఎన్ఎల్ సేవలు అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా సిగ్నల్స్ వినియోగదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. గత వారం రోజులుగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ ఎప్పుడు ఉంటాయో.. ఎప్పుడు ఉండవో తెలియని పరిస్థితి నెలకొంది. అర్ధగంట పాటు సిగ్నల్స్ బాగా అంది ఫోన్లు పనిచేస్తే.. రెండు గంటలపాటు మూగబోతున్నాయి. వారం రోజులుగా ఇదే పరిస్థితి. శుక్రవారం సాయంత్రం సిగ్నల్స్ పూర్తిగా నిలిచిపోయి ఫోన్లు పనిచేయకపోగా, శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అదే పరిస్థితి. అసలే సరిహద్దు ప్రాంతం కావడం, సమస్య మరింత తీవ్రంగా ఉంది. బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సిగ్నల్స్ సరిగా అందేలా చూడాలని వినియోగదారులు కోరుతునాన్నరు.

కల్వర్టులకు మరమ్మతులు చేయండి

బాలాయపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలోని పలుచోట్ల దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాయుడుపేట - వెంకటగిరి రోడ్డు నుంచి మేల్చూరు మీదుగా జయంపు మార్గంలోని సంగవరం రోడ్డు సమీపాన ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే నాయుడుపేట, వెంకటగిరి పట్టణాలవాసులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళనను ఆయా గ్రామాలలోని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బంగారుపేట నుంచి నిడిగల్లు మీదుగా జయంపు గ్రామానికి వెళ్లే మార్గంలోని నిడిగల్లు రైల్వేగేటు సమీపాన ఉన్న కల్వర్టు గతంలో వచ్చిన వరదలకు ధ్వంసమైంది. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహన దారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మేల్చూరు - జయంపు మార్గంలో సంగవరం వద్ద కోతకు గురైన కల్వర్టు

అసత్య కథనాలను ప్రచురిస్తే పరువునష్టం దావా వేస్తాం: పాశిం

గూడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరాధరణ ఆరోపణలు చేస్తూ అసత్య కథనాలను ప్రచురిస్తే పరువునష్టం దావా వేస్తామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అవినీతి డబ్బుతో నడుపుతున్న పత్రికలో టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ కథనాలు ప్రచురించడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిలికా, క్వార్ట్, ఇసుకను వైసీపీ నాయకులు దోపిడీకి పాల్పడి వేల కోట్ల రూపాయలు దోచుకున్నందుకే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. వైసీపీ నాయకులు చేసిన తప్పులను తమకు ఆపాదించేందుకు తప్పుడు కథనాలను ప్రచురిస్తూ ప్రజలను మభ్యపెట్టడాన్ని సహించబోమన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు మారుపేరైన చంద్రబాబు నాయుడు ఎవరు తప్పుచేసినా సహించబోరన్నారు. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వైసీపీ నాయకులు సహజ వనరులను కొల్లగొట్టి కోట్ల రూపాయలు దోచుకుంటే ఎందుకు ప్రచురించలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి మచ్చ తెచ్చేవిధంగా గంగాప్రసాద్‌పై అసత్య ఆరోపణలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. చట్టపరంగా అనుమతులు ఉన్నవారు మైనింగ్ నిర్వహించుకుంటే ఎవరూ అడ్డుచెప్పరన్నారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాలలో టీడీపీ ఎమ్మెల్యేల గెలుపునకు గంగాప్రసాద్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తే పరువునష్టం దావా వేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, పట్టాభిరామిరెడ్డి, కిషోర్‌నాయుడు, అబ్దుల్ రహీం, దుద్దా రాఘవరెడ్డి, చంద్రమౌళి, వాటంబేడు శివకుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, పక్కన భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రహీం, పట్టాభిరామిరెడ్డి, వాటంబేడు శివకుమార్, మస్తాన్ నాయుడు తదితరులు

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్, పక్కన సీఐ శ్రీనివాస్

గూడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. శనివారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసును త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా చట్టాను ఉల్లంఘించి నేరాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ సర్వీస్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్



వాటర్ సర్వీస్ సెంటర్‌లో ఎగిసి పడుతున్న మంటలు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద ఉన్న వాటర్ సర్వీస్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో భారీగా మంటలు చెలరేగాయి. బాధితుడి కథనం మేరకు.... పట్టణంలోని రాజగోపాలపురంలో నివాసం ఉంటున్న యాభవరెడ్డి మల్లాం జంక్షన్ వద్ద వాటర్ సర్వీస్ సెంటర్ నడుపుతున్నారు. శుక్రవారం రాత్రి సర్వీస్ సెంటర్‌ను మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపకశాఖ అధికారులు, పోసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. వాటర్ సర్వీస్ సెంటర్‌కు కూతవేటు దూరంలో పెట్రోల్ బంకు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంతో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు యాభవరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశాడు.

రైతులకు అండగా ఉండండి: విజయశ్రీ



చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, వైస్ చైర్మన్ శంకర్‌నాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల, సంచి కృష్ణయ్య, రమేష్‌నాయుడు, మురళీకృష్ణారెడ్డి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు

పెళ్లకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, సభ్యులుగా ఎన్నికైన వారు రైతులకు అండగా ఉండాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూచించారు. శనివారం మండలంలోని బీమవరం గ్రామానికి చెందిన దామెర ప్రసాద్‌నాయుడు స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికవడంతో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్ట్ కమిటీ సభ్యులందరూ రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. స్వర్ణముఖి ఆనకట్ట పరిధిలో సాగునీటి కాలువల అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. అనంతరం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలే నిర్వహించకుండా ఆ వ్యవస్థనే నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కు దక్కిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నదుల అనుసంధానంతో పాటు అన్ని నీటి వనరులను అందిపుచ్చుకుని రైతులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా కమిటీలు పారదర్శకంగా పనిచేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని సూచించారు. అనంతరం కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, సభ్యులు పాపాడి రాజగోపాల్‌రెడ్డి, వేలూరు హరినాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆమె భర్త పార్థసారధి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అలాగే పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు శివకుమార్, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, సుబ్బరామయ్య, మురళీ నాయుడు, కృష్ణమ నాయుడు, మునిరామయ్య, రవినాయుడు, కేవీనాయుడు, నూతలపాటి ప్రసాద్ నాయుడు తదితరులు స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, సభ్యులను అభినందించారు కాగా, ఆరుగురు సభ్యులు ఉన్న స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్‌లో పెళ్లకూరు మండలానికి చెందిన నలుగురు, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు మండలాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు.

స్మార్ట్ లాక్‌తో చోరీలకు చెక్





స్మార్ట్‌లాక్ గురించి వివరిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి - కార్యక్రమంలో పాల్గొన్న ఆలయాల ధర్మకర్తలు, అర్చకులు, వాపారస్తులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌లాక్(సైరన్ లాక్)తో చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చని డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఆలయాల ధర్మకర్తలు, అర్చకులకు సైరన్ లాక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలో ఉన్న తలుపులకు సైరన్ లాక్ అమర్చి, దానికి తాకినప్పుడు ఏ విధంగా అలారం మోగుతుందో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుని దొంగలు ఇళ్లల్లో, ఆలయాల్లో చోరీలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు భద్రపరుచుకోవడంతో పాటు సైరన్‌లాక్ అమర్చి వెళ్లాలని సూచించారు. ఇళ్లకే కాకుండా దేవాలయాలకు కూడా సైరన్ లాక్ అమర్చుకోవాలని ఆలయాల ధర్మకర్తలు, అర్చకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ బాబి, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, వ్యాపారస్థులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమిపూజ



సిమెంటు రోడ్డు భూమిపూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు శంకరయ్య, తిరుపాల్, వెంకటేశ్వర్లు తదితరులు

సూళ్లూరుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరాయి పంచాయతీ తోటకట్ల హరిజనవాడకు రూ.5 లక్షల నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దామరాయి, కడపత్ర సర్పంచులు రమణమ్మ, చెంచమ్మ, టీడీపీ నాయకులు తిరుపాల్, గొంజి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్ కౌశల్య తదిదతరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి



సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యార్థుల నిరసన

సూళ్లూరుపేట, గూడూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో విద్యార్థులు శనివారం ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేశ్ పాదయాత్ర ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి 77 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బ్లాక్‌లాగ్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ముని శివ, కిరణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ● విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంటు బకాయిలను వెంటనే విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. గూడూరులోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, వసతిదీవెన నగదు బకాయి ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో నంబరు 77ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, ప్రణయ్, సత్యసాయి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాంకుమార్‌రెడ్డి, పక్కన హరికృష్ణ, బాలయ్య, శ్రీనివాసులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు మోపడం సరికాదని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నాయకుడు తంగా పేచీరాజ్‌ను తెల్లవారుజామున 4గంటలకు పోలీసులు తీసుకెళ్లడం మంచి పద్ధతి కాదన్నారు. అతడిపై అక్రమ కేసులు పెట్టేందుకు ప్రత్నిస్తున్నారని, విచారణ చేయకుండా తప్పుడు కేసులు పెడితే పోలీసులు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ, డీజీపీ, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిట్టేటి హరికృష్ణ, కౌన్సిలర్లు కల్యాణి, వహిదా, సుజాత, శాతరాసి బాలయ్య, ప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, ధానీబాషా పాల్గొన్నారు.



గూడూరులో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, విజయ్‌కుమార్‌రెడ్డి, బత్తిని విజయ్‌కుమార్, బొమ్మిడి శ్రీనివాసులు



పెళ్లకూరు మండలం చిల్లకూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

గూడూరు అర్బన్, పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, వాకాడు, సూళ్లూరుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. గూడూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బత్తిని విజయ్‌కుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాధారెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు. ● పెళ్లకూరు మండలంలోని చిల్లకూరులో జగన్ జన్మదిన వేడుకలను ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిష్కిల్లా, వైస్ఎంపీపీ ఇలకా సుధారాణి, వైసీపీ మండల కన్వీనర్ వెంకటరత్నం, నాయకులు పెళ్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కరణం రఘునాయుడు, పాలూరు దశరథరామిరెడ్డి, హరిబాబురెడ్డి, ఎల్లు మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయుడుపేట, ఓజిలి, వాకాడు, సూళ్లూరుపేటలో జగన్‌జన్మదిన వేడుకలను నిర్వహించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ తరగతులు

కోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లలో దేశభక్తి, క్రమశిక్షణ, సోదరభావం, పోటీతత్వం పెంపొందించడం కోసమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని కమాండెంట్ గణేష్ గొడంగవే అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ వార్షిక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈనెల 29వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని గొడంగవే తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజ, విద్యార్థులు ఉన్నారు.

ముక్కంటి సేవలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే



ఎస్సీవీ నాయుడిని కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కుటుంబ సమేతంగా శనివారం శ్రీకాళహస్తీశ్వ రాలయానికి విచ్చేశారు. ఆమెకు ఆలయాధికారులు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ పీఆర్వో రవి పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే విజయశ్రీ మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడును కలిశారు. ఆయన్ని సన్మానించారు. పెళ్లకూరు టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, చెంబేడు ఆయకట్టు అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



రామానుజన్ గురించి వివరిస్తున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ జయంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గణిత శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ శ్రీనివాస రామానుజన్ సిద్ధాంతాలు, మాజిక్ నెంబర్స్ గురించి వివరించారు. గణిత శాఖ ఇన్‌చార్జి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దీన దయాల్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు, మాలతి గాబ్రియల్, గణిత శాఖ అధ్యాపకులు సునీత, కళాశాల అధ్యాపకులు ఉషారాణి, మీనాక్షి, గీత తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో దిస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ జనార్దన్‌రావు జే.పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గణితం, విజ్ఞాన శాస్త్ర పాఠ్యాంశాలపై జాతీయ స్థాయిలో జరిగిన మొదటి స్థాయి పరీక్షలో 4 నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు 34 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. 208 మందిలో 153 మంది రెండో స్థాయికి పరీక్షకు ఎంపికైనట్లు వివరించారు. హెచ్ఎం విశాల పాల్గొన్నారు.

ధ్యానంతో మానసికోల్లాసం



అవగాహన కల్పిస్తున్న చైర్మన్ అశోక్ రాజు

నారాయణవనం, డిసెంబర్ 21(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండవచ్చని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ అశోక్‌రాజు పేర్కొన్నారు. శనివారం కళాశాలలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ధ్యానం చేయించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ధ్యానాన్ని తమ దైనందిన జీవనంలో అలవాటుగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రాజు, హెచ్‌వోడీలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్, సురేష్, ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జోరందుకున్న వరి నాట్లు



కేవీబీపురం, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఆగడంతో వరి నాట్లలో రైతులు నిమగ్నమయ్యారు. నాట్లు జోరందుకున్నాయి. మండలంలో మొత్తంలో వరి సుమారుగా 6వేల హెక్టార్లలో సాగు చేయాల్సి ఉందని వ్యవసాయ అధికారుల అంచనా. నాట్లు ఇప్పుడే మొదలవడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో పురుషులు సైతం కొన్నిచోట్ల నాట్లు వేస్తున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రెవెన్యూ సదస్సుకు 11 వినతులు

రేణిగుంట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుర్రకాలువ గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో 11 వినతిపత్రాలు అందాయి. వాటిలో శ్మశాన స్థలం ఆక్రమణ, ఇంటి పట్టాల కోసం, రీసర్వే తదితరాలు ఉన్నాయి. తహసీల్దారు సురేష్ బాబు, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అధిక దిగుబడులపై అవగాహన సదస్సు

వరదయ్యపాళెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్పిక్, గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని రైతులకు అధిక దిగుబడులపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఆర్ ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో రీజనల్ మేనేజర్ సీ. గంగాధర్ మాట్లాడుతూ వరి, మిరప, మామిడి, పంటలలో చేపట్టాల్సిన పోషకాల యాజమాన్యాల పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, పంటలకు సోకే చీడ, పీడలు, తెగుళ్ల నివారణ చర్యల గురించి వివరించారు. ప్రాంతీయ మేనేజర్ శివశంకర్, సీనియర్ శాస్త్రవేత్తలు ఉమా మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, సాయికృష్ణ, డీలర్లు రామ్మూర్తి నాయుడు, కన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



రవితేజ (ఫైల్)

రేణి గుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రేణిగుంటలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పాత చెక్‌పోస్టు వద్ద నివాసం ఉంటున్న రవితేజ (28) పూణేలో ఉద్యోగం చేసేవాడు. అక్కడ ఉద్యోగం మానేసి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఏమైందో ఏమో శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో గొబ్బెమ్మ గ్రామోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. నాలుగు వీధుల్లో గొబ్బెమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



నారాయణవనం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు స్వామివారిని సేవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యను చదువుతుంటే రూ.708 కోట్లు మాత్రమే విడుదల చేశారని మిగిలిన రెండువేల కోట్లు విడుదల చేయలేద న్నారు. కోర్సులు పూర్తయిపోయినా యాజ మాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వివరించారు. ఏరియా అధ్యక్షులు శివ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ముఖేష్, చైతు, సల్మాన్, అంకయ్య పాల్గొన్నారు.

కబ్జా భూమి కోసం వైసీపీ నేతల కుస్తీ



వైసీపీ నేతల వివాదానికి కారణమైన కబ్జా స్థలం ఇదే

రేణిగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కబ్జా చేసిన ప్రభుత్వ భూమి తమదంటే తమదంటూ వైసీపీలోని ముగ్గురు నేతల నడుమ వివాదం నెలకొంది. కరకంబాడి పంచాయతీలో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలోని సర్వేనంబరు 764లో ఐదు ఎకరాలను కేటాయించారు. కాలక్రమేణా ఈ స్థలం ఆక్రమణలతో కుంచించుకుపోయింది. మిగిలిన కొంత స్థలంలో గుట్టను చదును చేసి పంచాయతీ భవనాన్ని నిర్మించారు. గత వైసీపీ హయాంలో మరికొంత స్థలాన్ని చదును చేసి సచివాలయ భవన నిర్మాణ పనులు చేపట్టారు. దీనికి వెనుకభాగంలో గుట్టపై కన్నేసిన ఓ వైసీపీ నాయకుడు నకిలీ పట్టాలు సృష్టించి చదును చేసి హద్దు రాళ్లు నాటే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీకే చెందిన మరో ఇద్దరు నాయకులు ఈ స్థలం తమదంటే తమదంటూ రచ్చకెక్కారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కేటీ రోడ్డులో ఇరుక్కున్న లారీ



లారీని బయటకు తీస్తున్న క్రేన్

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు పదో మైలు దగ్గర శనివారం లారీ ఇరుక్కుపోయింది. కేటీ రోడ్డుకు ఇరువైపులా పైపులైన్‌లు వేశారు. వర్షానికి పైపులైను ఉన్న చోట తేమశాతం ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇచ్చేందుకు ఓ లారీ రోడ్డు అంచున ప్రయాణించింది. ఆ సమయంలో పైపులైను ప్రాంతంలో వెళ్లడంతో లారీ దిగబడిపోయింది. రెండు గంటలపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అతికష్టంపై లారీ డ్రైవర్ క్రేన్ సహాయంతో దిగబడిపోయిన లారీని బయటకు తీశారు.

పారిశుధ్య సామగ్రి పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలకు బీఎన్‌కండ్రిగ కార్యదర్శి సుబ్రమణ్యం తన సొంత డబ్బులు రూ. 15వేలతో పారిశుధ్య సామగ్రి కొనుగోలు చేసి ప్రిన్సిపాల్‌కు శనివారం అందజేశారు.

25న జిల్లా రచయితల సంఘ తొలి వార్షికోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): జిల్లా రచయితల సంఘం తొలి వార్షికోత్సవం ఈనెల 25న తిరుపతిలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు యూత్ హాస్టల్‌లో కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఉద్యోగాల పేరిట మోసం ఒకరికి రిమాండ్



ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

నారాయణవనం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. నారాయణవనానికి చెందిన రమణ కుమారుడు వినోద్ అలియాస్ దినేష్ నారాయణవనం, వడమాలపేట, పుత్తూరులో ఉన్న నిరుద్యోగులను గుర్తించి, వారికి కోర్టులో ఉద్యోగాలు తీసిస్తానని నమ్మించాడు. వారి నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశాడు. ఫిర్యాదులు అందడంతో నిందితుడిని శనివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కోర్టు అతడిని రిమాండ్‌కు ఆదేశించింది. దీంతో కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

రెవెన్యూ సదస్సు విశేష స్పందన



కేవీబీపురం, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపాళెం గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన లభించింది. తహసీల్దార్ మునిరత్నం రెడ్డి మాట్లాడుతూ సదస్సుకు 28 వినతులు వచ్చాయని తెలిపారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ, సచివాలయ, అటవీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

నారాయణవనం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగిరికోన అటవీప్రాంతంలో సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ శాఖ డీఎస్పీ వాసుదేవచౌదరి, పుత్తూరు సీఐ మురళీమోహన్ తెలిపారు. సింగిరికోన అటవీ ప్రాంతంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 200 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. అలాగే తిరువట్యం గ్రామంలో సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్ఐ శివప్రసాద్, అప్జల్‌బాషా, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా ధ్యాన దినోత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 21 అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుకబ్రహ్మాశ్రమంలోని యోగా కేంద్రం వద్ద ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. యోగా గురువు మార్కండేయులు ధ్యానం, యోగ, ప్రాణామాయం నిర్వహించారు. యోగా మాస్టర్స్ భాస్కర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తప్పవు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలోని పాలకులు నియోజకవర్గంలో విచ్చలవిడిగా భూదోపిడీకి పాల్పడ్డారని వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టంచేశారు. శనివారం సొంత గ్రామం ఊరందూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు మండలంలోని విరూపాక్షపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సన్న యూరియా కొరతతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీ నాయుడు ఎమ్మెల్యేకు తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్‌తో ఫోన్ ద్వారా సమస్యను తెలియజేశారు. పరిష్కరించాలని కోరారు.

వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టాలి

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

బస్టాండ్ ప్రాంగణం పరిశీలన

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పైకప్పు కూలిపోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉండటంతో సంబంధిత శాఖ మంత్రికి ఫోన్ ద్వారా సమస్యను తెలియజేశారు. అలాగే డ్రైవర్లకు, కండక్టర్లకు కనీస వసతులు లేవని, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని సమస్యను పరిష్కరించాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

పొలాలకు రోడ్డు వసతి కల్పించండి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 21: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలో పొలాలకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేయాలని శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలోని సచివాలయం నుంచి చెరువు కట్ట మీదుగా పొలాలకు వెళ్లేందుకు రోడ్డు ఉందన్నారు. చెరువు చివరి భాగంలో రోడ్డు సమస్య ఉందన్నారు. అక్కడ కొందరి రైతుల నుంచి భూమి సేకరించి రహదారి వసతి కల్పించాలని విన్నవించారు. తహసీల్దార్ సుబ్రమణ్యం స్పందిస్తూ రోడ్డు కోసం అవసరమైన భూములను పరిశీలించారు. రైతులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ సమస్య పరిష్కరిస్తామని హామీ నిచ్చారు. రెవెన్యూ సదస్సులో 29 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, సర్పంచ్ గంగయ్య, టీడీపీ నాయకులు సుంద రయ్య, కాటూరు రమణయ్య, భాస్కర్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిని పేదలకు పంచాలి



కొత్తమారికుప్పంలో అర్జీలు సమర్పిస్తున్న ప్రజలు

సత్యవేడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తమారికుప్పం పంచాయతీ పరిధిలో ఇతర రాష్ట్రాల ఆక్రమణదారుల చెరలో ఉన్న ప్రభుత్వ భూములను రక్షించి, వాటిని గ్రామంలోని నిరుపేద గిరిజన, దళితులకు పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రమేష్, సీపీఐ నాయకుడు నాగార్జున ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీలో శనివారం డీటీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పంచాయతీలో సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, విచారణ జరిపి అర్హులకు అందేలా చూడాలని కోరారు. ఇందిరానగర్ కాలనీకి శ్మశాన స్థలం కేటాయించాలని కాలనీవాసులు విన్నవించారు. తాము ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని మాజీ ఎమ్మెల్యే సి.దాస్ కుమారుడు దామోదరదాస్ వేధిస్తున్నాడని న్యాయం చేయాలని సురేష్ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు, జయన్, ఎంపీటీసీ మోహన్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను శనివారం వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ముక్కంటి ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పేదలకు స్టీల్ ప్లేట్లు అందజేశారు. అనంతరం అన్నదానంచేశారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండు, పాలు బిస్కెట్లు అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, తొట్టంబేడు మండలం ఇన్‌ఛార్జి ఉన్నం వాసునాయుడు, ప్రభాకర్ రెడ్డి, చంద్రయ్య నాయుడు పాల్గొన్నారు.

సత్యవేడు/వరదయ్యపాళెం/బుచ్చినాయుడుకండ్రిగ: సత్యవేడులో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్, గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు.

● వరదయ్యపాళెంలో వైసీపీ నాయకులు అన్నదానం చేశారు. నూకతోటి రాజేష్, నాయకులు దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, చిన్న పాల్గొన్నారు. ● వరదయ్యపాళెంలో 200 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నూకతోటి రాజేష్, సత్యవేడు జేఏసీ చైర్మన్ వేలూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.